## పాడి కౌశిక్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

- కందుగుల అంబేద్కర్ కాలనీ మహిళల తీర్మానం
- దళితబంధు ప్రదాత రుణం తీర్చుకుంటామని ప్రతిన



సమావేశమైన మహిళలు, ప్రజాప్రతినిధులు

హుజూరాబాద్ రూరల్,అక్టోబర్ 3: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామంటూ దళిత మహిళలు ప్రకటించారు. హుజూరాబాద్ మండలం కందుగుల అంబేద్కర్‌కాలనీలో సోమవారం రాత్రి మహిళలు సమావేశమయ్యారు. కౌశిక్‌ను గెలిపించుకొని దళిత బంధు ప్రదాత సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుంటామని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, సర్పంచ్ ప్రభావతి, ఎంపీటీసీ పద్మ, మహిళలు రొంటాల కరుణ. అరుణ, రజిత, సారక్క, ఇమ్మడి లక్ష్మి, పద్మ. సుగుణ, ప్రభ, ప్రమీల,వరలక్ష్మి. నాగులు. ఇమ్మడి మరియా,స్వరూప, పనింద్రత. సునీత. బీఆర్ఎస్ నాయకులు నాయకులు. ఉమ్మడి నాగేశ్వరరావు, కుమారస్వామి. రామచంద్రం. ఇమ్మడి కిరణ్. రాజేశ్. భాస్కర్. ప్రవీణ్ .ప్రశాంత్. ఇప్పలపల్లి రవి, శ్రీనివాస్. వెంకట్ స్వామి. కొండ వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు ఉన్నారు.




మొర్రాపూర్‌లో ₹20 లక్షలతో నిధులతో నిర్మించిన జీపీ భవనం



తెర్లుమద్దిలో ₹20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన




తుర్కపల్లిలో ₹16 లక్షలతో నిర్మించిన జీపీ భవనం

# ప్రారంభోత్సవానికి రెడీ

ముస్తాబాద్ మండలం ప్రగతి పథంలో పయనిస్తున్నది. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నది. ఈ మేరకు పలు గ్రామాల్లో నూతన జీపీ భవనాలు, పల్లె దవాఖానలు, సీసీ రోడ్లు, వంతెనల నిర్మాణం పూర్తయింది. అమాత్యుడు రామన్న సూచనల మేరకు పూర్తయిన పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం ప్రారంభోత్సవం చేయనుండగా, సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

– ముస్తాబాద్, అక్టోబర్ 3



తెర్లుమద్ది గ్రామంలో ₹1.77 కోట్లతో నక్కవాగుపై నిర్మించిన వంతెన

- పలు గ్రామాల్లో జీపీ భవనాలు, వంతెనలు, సీసీ రోడ్లు, పల్లె దవాఖానలు పూర్తి
- మంత్రి కేటీఆర్ చొరవతో శరవేగంగా పనులు
- నేడు ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ముస్తాబాద్ మండలంలో మంత్రి కేటీఆర్ సాహకారంతో పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో అమాత్యుడు రామన్న సూచనల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేయనున్నారు. మొర్రాపూర్‌లో ₹20లక్షలతో నిర్మించిన జీపీ భవనం, తెర్లుమద్దిలో ₹8లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం, ₹33 లక్షలతో ప్రగతి ప్రాంగణం, ₹20లక్షలతో పల్లె దవాఖాన, ₹1.77కోట్లతో నక్కవాగుపై వంతెన, సేవాలాల్‌తండాలో ₹16లక్షలతో నూతన జీపీ భవనం, తుర్కపల్లిలో ₹16లక్షలతో జీపీ భవనం, ₹10లక్షలతో సీసీరోడ్డును ప్రారంభిస్తారు. తుర్కపల్లిలో కేసీఆర్ ప్రగతి ప్రాంగణానికి భూమిపూజ చేయనున్నారు. ఆవునూర్‌లో ₹23.16లక్షలతో జీపీ భవనం, ₹33లక్షలతో ప్రగతి ప్రాంగణం, రామలక్ష్మణులపల్లెలో ₹12.60లక్షలతో వైకుంఠ ధామం, ₹15లక్షలతో సీసీరోడ్లు, ₹10 లక్షలతో కమ్యూనిటీహాల్ పనులు పూర్తికాగా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చాలా పనులు చేసినం..



తర్కపల్లి నూతన పంచాయతీ. గ్రామంలో ఎస్సీలు అధికంగా ఉన్నందున తనకు అవకాశం వచ్చింది. మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామంలో చాలా పనులు చేయడం తృప్తిగా ఉంది. అమాత్యుడి సహకారంతో రహదారులు, నూతన జీపీ భవనం, క్రీడాప్రాంగణం, వైకుంఠ ధామం, డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడం చేసినం. ఇందుకు సహకారం అందించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు.

– కాశోళ్ల పద్మ, సర్పంచ్ (తుర్కపల్లి)

### మంత్రి కేటీఆర్ సహకారంతో..



మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామాలు ప్రగతి పథంలో ఉన్నాయి. తెర్లుమద్దిలో సుమారు రూ.మూడు కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరిగాయి. మారుమూల గ్రామానికి రహదారులు, వంతెన, కమ్యూనిటీ భవనాలు, పల్లె దవాఖాన, కేసీఆర్ ప్రగతి ప్రాంగణం, మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించి, మంత్రి కేటీఆర్ సహకారంతో నేడు ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉన్నది.

-కలకొండ కిషన్‌రావు, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు

# ముగిసిన దరఖాస్తుల విచారణ

- నేడే తుది ఓటరు జాబితా ప్రకటన

కలెక్టరేట్, అక్టోబర్ 3 : ఓటరు జాబితాలో తప్పొప్పులు, మార్పులు, చేర్పులపై చేసుకున్న దరఖాస్తుల విచారణ ఈ నెల 1తో ముగియగా, జిల్లా ఎన్నికల అధికారులు నేడు తుది జాబితా ప్రకటించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్లు తొలగింపు, తదితర కారణాల నేపథ్యంలో ఐదు మాసాలుగా జిల్లా యంత్రాంగం ఓటరు జాబితా పరిశీలనపై దృష్టి సారించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు జాబితా షెడ్యూల్ ప్రకటించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్ –2023 కింద ఈ ఏడాది మే 25 నుంచి నెల రోజుల పాటు ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టిన జిల్లా అధికారులు నేటితో ముగింపు పలుకనున్నారు. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం 9,97,143 మంది ఓటర్లు జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నారు. ఎస్ఎస్ఆర్ –23 కింద చేపట్టిన ఓటరు నమోదు శిబిరాల అనంతరం ఆగస్టు 2న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లా ఓటర్లు 10,13,937కు చేరుకున్నారు. వంద శాతం ఓటర్ల నమోదే లక్ష్యంగా చేపట్టిన ఎస్ఎస్ఆర్–23 కార్యక్రమంతో 8 మాసాల్లోనే జిల్లాలో 16,794 మంది ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. పూర్తి స్థాయి లక్ష్యం చేరుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం పలు విడుతలుగా ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేసింది. ప్రధానంగా 18 ఏండ్లు నిండిన వారిని టార్గెట్ చేస్తూ, విద్యా సంస్థల్లో ప్రత్యేక క్యాంపెయిన్‌లు ఏర్పాటు చేసింది. ఆగస్టు 25,26 తేదీలతో పాటు సెప్టెంబర్ 2,3 తేదీల్లో కూడా యువత, ఇతరుల కోసం శిబిరాలు ఏర్పాటు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 4,373 కొత్తగా ఓటరు దరఖాస్తులు వచ్చినట్లు ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. వీటిపై గత నెల 19వరకు అభ్యంతరాల దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, ఈ నెల 1 వరకు విచారణ జరిపారు. సక్రమంగా ఉన్న వాటిని తుది జాబితాలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో మొత్తంగా 10,18,300 పైచిలుకు ఓట్లు తుది జాబితాలో నమోదయ్యే అవకాశాలున్నట్లు స్పష్టమవుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుండగా, ఆలోపు వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించి, ఓటు హక్కు కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# క్రిస్టియన్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆశిష్

సైదాపూర్, అక్టోబర్ 3: క్రిస్టియన్ యూత్ కమిటీ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పెద్దెల్లి ఆశిష్ ఎన్నికయ్యారు. మంగళవారం హుస్నాబాద్‌లో జరిగిన నియోజకవర్గ సమావేశంలో ఆయనను ఎంపికచేశామని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆశిష్ మాట్లాడుతూ యవత అభ్యున్నతి, సంక్షేమం కోసం తనవంతు కృషిచేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# రేవెల్లిలో తలలేని మొండెంతో మృతదేహం లభ్యం

- హత్యా..ఆత్మహత్యా అని విచారణ చేస్తున్న పోలీసులు

చొప్పదండి, అక్టోబర్ 3: రేవెల్లిలోని వ్యవసాయ బావిలో తలలేని మొండెంతో మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన ఊకంటి అశోక్ రెడ్డి తండ్రి ప్రతాపరెడ్డి తను కౌలు చేసే రామ్‌రెడ్డికి సంబంధించిన బావిలో మృతదేహం కనిపిచిందని పోలీసులకు సమాచారమిచ్చారు. చొప్పదండి పోలీసులు వెళ్లి బావి వద్ద పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయి తేలుతూ కనిపించింది. మృతుడు లేత పసుపు రంగు షర్ట్, బ్లాక్ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. అతడి ప్యాంటు కుడి జేబులో సెల్ ఫోన్ కనిపించింది. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి శవాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలానికి కరీంనగర్ రూరల్ ఏసీపీ టీ కరుణాకర్‌రావు, కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్, చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారి వచ్చి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. అతడి జేబులో దొరికిన సెల్‌ఫోన్‌ను పరిశీలించగా మృతుడు మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన ముతికల గణేశ్ (35) అని గుర్తించారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కొడుకులు ఉన్నారు. గణేశ్ గత నెల10న రాత్రి 10 గంటలకు రేవెల్లిలో తన తల్లి గారి ఇంటి నుంచి అదృశ్యమైనట్టు మృతుడి భార్య రజిత చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో చొప్పదండి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. మృతుడి తల కనిపించకపోవడంతో మృతుడి బంధువుల అభ్యర్థన మేరకు కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన డాక్టర్ ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్ట్‌మార్టం చేశారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో తలభాగం ఊడిపోయిందా లేదా వేరే కారణాలతో కనిపించకుండా పోయిందా అని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## న్యాయం కావాలి

వీణవంక, అక్టోబర్ 3: మండల కేంద్రంలోని ఆర్ఎంపీ అన్వర్‌పాషా తనను వేధిస్తున్నాడని శంకరపట్నం మండలం కల్వలకు చెందిన ఓ యువతి మంగళవారం ఆర్ఎంపీ వైద్యుడు పని చేస్తున్న దవాఖాన ఎదుట నిరసన తెలిపింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ఎంపీగా పని చేస్తున్న వ్యక్తి తనను వేధిస్తున్నాడంటూ గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ముగ్గురిపై ఫిర్యాదు చేస్తే ఒక్కరిపై మాత్రమే కేసు నమోదు చేసి, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించింది. తనకు న్యాయం కావాలంటూ కత్తి చేత పట్టుకొని దవాఖాన ఎదుట నిరసన తెలిపింది. సమాచారం తెలుసుకున్న సీఐ కిశోర్, ఎస్ఐ ఆసిఫ్ మళ్లీ పిటిషనిస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని బాధితురాలికి హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించింది.

# శ్రీ చక్ర ప్రతిష్ఠాపనను విజయవంతం చేయాలి



సమీక్షా సమావేశంలో పాల్గొన్న నాయకులు

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 3:మండలంలోని ఖాసింపేట శ్రీ మానసాదేవి ఆలయంలో ఈ నెల 18 నుంచి జరిగే శ్రీ చక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఆయా పార్టీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో ఆలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 15న శ్రీచక్రంను గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్, జంగాపల్లి, హనుమాజిపల్లి, మైలారం, గన్నేరువరం, మాదాపూర్, పారువెల్ల వడ్లూరు గ్రామాల మీదుగా ఆలయం వరకు మహిళల కోలాటాల మధ్య ఊరేగింపుగా తీసుకొస్తారని వెల్లడించారు. ఆయా గ్రామాల్లోని మహిళలు, భక్తులు శోభాయాత్రలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆలయ గౌరవాధ్యక్షుడు నర్సింహారెడ్డి, చైర్మన్ చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, ఆలయ ప్రధాన అర్చకుడు నాగసాయిశర్మ, ఉప సర్పంచ్ సంపత్‌రెడ్డి, ఆయా పార్టీల అధ్యక్షులు, సర్పంచులు పాల్గొన్నారు.